ఎవరనుకుంటారు ?

# పీటలమీది పెళ్ళికి పిల్లి ఎదురొస్తుందని! —

● 'అవనీంద్ర' ●

జీవితసంగ్రామంలో అనేకమైన చిత్రవిచిత్రపరివర్తనలు. మానవుల ఆకాలపరివర్తనలే వాటికాధారాలు. వాటిని మానవులు అనేకరూపాల్లో ఎదుర్కోక తప్పదు. వాటి స్మరణ ఒక్కొక్కప్పుడు మానవుని కదల్చివేస్తుంది ఒక్కొక్కప్పుడు, ఏ ఇతర భీకరసంఘటననైనా ఎదుర్కొనే ధైర్యాన్నిస్తుంది. అలాగే—

మనోరమ జీవిత ప్రారంభంలో ఇదియొక దుర్భర సంఘటన! అది తలవని తలంపుగా జరిగిన విచిత్ర సంఘటన! కాకపోతే ఎవ్వరనుకొంటారు, పీటలమీద వివాహం ఆగిపోతుందని? పగవాడైనా ఊహించి కోరగలడా? కాని ప్రత్యక్షంగా జరిగింది. దానిని ఇప్పుడు తప్పుకుండే ఉపాయం కానరాదు. క్షణానికి వచ్చేది ఎవ్వరికి తెలియదుకదా!

... ... ...

బంధువులందరూ ఇళ్ళకి తిరిగివచ్చారు. వాళ్ళ పరితాపాన్ని ఎవళ్ళూ గమనించలేకపోయారు. లేకపోగా అందరూ దుయ్యబట్టుతున్నారు. ఏమనీ!-అంత పరిస్థితులు తెలియకుండా ఎవ్వరు తలబెట్టమన్నారు? మహా పెళ్ళిచేసేవాడులాగా బయలుదేరాడు. అయినా తను చేస్తాడని అనుకున్నామా? ఇంత అప్రయోజకుడు ఎక్కడా లేడు" అని.

అందువల్ల మనోరమ తండ్రి, విశ్వనాథంగారు అందరిముందరా తల ఎత్తలేకపోయాడు- సానుభూతి కలవాళ్ళు, వెళ్ళి "విచారం పెట్టుకోకోయ్ ఏం చేస్తాం. అల్లా జరుగుతుందని ఎవరైనా కలలోనైనా అనుకున్నామా? కొద్దిరోజులు ఓపిక పట్టి మళ్లా పర్యటనచేస్తే దొరక్కపోతాయా సంబంధాలు?" అని.

అందులో ఒక పెద్దమనిషి లేచి "విశ్వనాథం! మరేం భయపడకు. నా యెరుకలో చాలా సంబంధాలున్నాయి. అవన్నీ విచారించుకొని కొద్దిరోజుల్లో తిరిగివస్తాను. వెళ్ళిరండను, ఇప్పుడు బయలుదేరిపోతాను" అని తనమాటగా నమ్మకం పెట్టుకోమని అభయమిచ్చాడు. అంతకన్న వేరు ఏం కావాలి ఆ నిస్సహాయసమయంలో! ప్రాణం లేచొచ్చింది. వెంటనే విశ్వనాథంగారు లేచి ఆ పెద్దమనిషి రెండుచేతులూ పట్టుకొని, కళ్లు నీళ్ళతో నిండగా" ఆ సహాయంచేస్తే, అంతకన్న నాకు చేయదగిన మహోపకారం ఇంకేంలేదీసమయంలో. నన్ను మన్నించండి. నన్ను మళ్లా మనవాళ్లల్లో, తిరిగి తలయెత్తుకొనేటట్లు చెయ్యండి బాబూ. ఏ దారేపోయేవాడికైనాసరే నా పిల్లనిచ్చి, పెళ్ళి చెయ్యటానికి నా కభ్యంతరంలేదు, నాకింకో ధ్యాసే లేదు బాబూ. నా పిల్లా నేనూ సంఘంలో మనుషులయేటట్లు చేయాలి. అంతా మీ చేతుల్లో ఉంచాను. కార్యభారం ఇక నామీదలేదు. ఇవి చేతులు కావు కాళ్ళు. శ్రమకు నన్ను క్షమించండి" అని ఎంతో బతిమిలాడాడు.

"మరేం భయపడకోయ్ విశ్వనాథం. నేనున్నానుగా! ఇప్పుడే బయలుదేరిపోతాను" అని ఆ పెద్దమనిషి లేచి ఇంటికెళ్ళాడు.

... ... ...

ప్రథమంలో, మనోరమ తనకు వివాహం జరుగుతోందంటే, ఎంతో మురిసిపోయింది. అప్పుడామె హృదయం, పౌర్ణమినాడు సముద్రంలా ఉప్పొంగిపోయింది. తను కోరిన వరుడు వస్తున్నాడుకదానని ఎంతో ఆనందించింది. తీరని కోరిక అవుతుందేమోనన్న తన మనోవాంఛ, సఫలమవుతోందీ అంటే, ఎవరి హృదయాలు వికసితాలు కావూ? అల్లాగే మనోరమా...

ను ఎంతో అలంకరించుకొంది. అద్దం ఎదుట నిలుచొని "నేనే, సఫలమనోరథను. నేను శకుంతలను, నేను సావిత్రిని" అని అనుకొంది. తన యౌవనపు లావణ్యాన్ని తిరిగి, తిరిగి చూచుకొని మహదానందం పొందింది.

...  ...  ...

కాని...పెళ్లికూతురై ఇవతలికి వచ్చేటప్పటికి ఏముంది ? తండ్రిగారు కళ్లల్లో నీళ్లు చూచేటప్పటికి నివ్వెరబోయింది. శిలాప్రతిమ అయింది. తను ఏం అడగటానికీ మనస్కరించలేదు. తను పెళ్ళికూతురై, మరుక్షణంలో, కళ్యాణమండపం మీద ఉండవలసిన సమయంలో ఈ అశుభమేమిటి ? అంతకు పూర్వంవరకూ ఆమె గాంధర్వ లోకంలో విహరించింది ఈ ప్రపంచకపు పోకడలే తెలియలేదు. ఆమె ఎంత దుఃఖించవలసి వుందో ! ఆమె హృదయవాంఛ ఎలాటి అస్పృత రూపందాల్చింది? నిజంగా అదంతా, ఎండమావియేనా ? తను ఇక ప్రపంచంలో—అంటే, తన తోటి చెలులతో తిరిగి తను తన మనోరథుణ్ణి గూర్చిన తలపులను కథలుగా చెప్పుకొని మురవటానికి బదులు, ఏ శిథిల ఊహాలయంలోనో ఒంటరిగా విహరించవలసిందేనా ?

ఈ తలపులన్నీ ఒకటితరువాత ఒకటి అనివార్యంగావచ్చి, తన మనస్సును డోలాందోళితం చేసినయ్. అయినా తను ఆ సమయంలో ఏం జరిగిందని అడుగుతుంది ? వెంటనే తల్లిని వెళ్ళి కావలించుకొంది. ఒక్కసారిగా దుఃఖవివశయైంది. ఏమీ అడగ నోరాడలేదు. తన దుఃఖమే తల్లికి తన బాధను తెలిపింది. వెంటనే తల్లి, అవ్యమనస్కురాలై వుండడంచేత కూతురు నిజస్థితిని చూచి మరింత ఖిన్నురాలైంది.

"మరేం లేదమ్మా దుఃఖించకు. ఈ శుభసమయంలో ఏడవకూడదు. దైవముపైన ఉన్నాడు. నిండు పెళ్ళికూతురువై ఉండగా నీకేం భయమమ్మా ? నేనూ, మీ నాన్నా, నీ సౌభాగ్యానికి బాధ్యులం" అని ఓదార్చింది. తనుకూడా అసహాయయైన తనకూతురుతోపాటు దుఃఖిస్తే వచ్చే లాభం ఏముంది ? ఆమెకన్న పెద్దదైయుండి అంత పని చెయ్యవచ్చునా ? ఆమెను ఒడిలోకి తీసికొని తల నిమురుతూ, ఎంతోసేపు అలా ప్రతిమలాగా కూర్చుండిపోయింది.

...  ...  ...

మనోరథ ఊహాసౌధాలన్నీ కూలిపోయినయ్.

......నిజంగా...అంతపనే ! ఇక ఆమె జీవిత పరివర్తనమేమిటి ? ఆమె ఒక అంతులేని, అగాధమైన నూతిలోనికి విరామంలేకుండా పడిపోతున్నట్లు భావించుకొంది. ఏం చెయ్యగలదు? వట్టి అబల ! క్రిందటి క్షణంవరకూ ఆ శుభక్షణానికి నాయికననుకొన్నది మరుక్షణంలో అబద్ధమైంది. ఇక ఆమెకీ ప్రపంచము వృథా.

తండ్రితోపాటు ఇంటికి వచ్చింది. ఎప్పుడైనా ఊరికి వెళ్లివస్తే, ఏమేమి కొత్తవార్తలు చెబుతుందోనని తన ప్రియస్నేహితురాలు గిరిజ వచ్చేది. గంటలకొలదీ కూర్చుండేది. వారిద్దరి సంభాషణలో ఎన్నో ఎన్నో ఊహాలు రూపాలు దాల్చేవి కాని ఇప్పుడు ఏం చెబుతుంది ? పరిస్థితి ఇలా విరమించిందని విన్న గిరిజ మనోరమ వద్దకు వచ్చి ఎంతో ఖిన్నురాలైంది. ఇద్దరూ చాలసేపటివరకూ మౌనమూర్తులయ్యారు. ఇంక అలా మౌనంలో కూర్చుండలేక గిరిజే పలకరించింది.

"ఏమిటే, మనూ ఏం జరిగిందే ?"

"............"

"మేమంతా ఎంతో అనుకున్నాం ? నాలుగు


కృష్ణవేణి సిరాలు




ఉల్లమలరఁ జేయు నల్లఁదనమునందు,
పరుగు తరుగు లేని పొలుఁదలను,
ఎదకు నింపుఁగూర్చు కృష్ణవేణిసిరాలు
పొదలు కృష్ణవేణి నదిని బోలి.
మద్రాసు, దక్షిణజిల్లాలకు డిస్ట్రిబ్యూటరు:
సి. ఆర్. తిరుమల్‌పాడ్,
141, గోవిందప్పనాయకన్ వీధి, మద్రాసు1.

రోజుల్లో వివాహితవై వస్తావని. మా తోపాటు వచ్చే శ్రావణమాసంలో నోములు నోచుకుంటావనీ..... ”

“.. ..... ...”

“అయినా ఎందుకులే. ఏమీ అనుకోకే మనూ. ఈ పాపాన్ని ఆ దౌర్భాగ్యుడు అనుభవించక పోతాడా ? మిమ్మల్నందర్నీ నమ్మించి, పీటల మీదకు తెచ్చిన ముహూర్తాన్ని చెడగొట్టుకున్న వాడి జీవితం ఎందుకూ పనికిరాకుండా పోతుంది. వీడు కాకపోతే, మరింకో వరుణ్ణి, నాన్న వెతికి తీసికోరాలేడా ? నీవేం దుఃఖించకే అమ్మాయ్. నీకు పది-హేనురోజుల్లో మంచిసంబంధం రాక పోతే చూడు !''

“ఆ......! నిజంగానే గిరీ !!” అప్పటికిగాని మనోరమ తెప్పరిల్లలేదు. తనకు మళ్లీ మంచి సంబంధం కుదురుతుందన్న శుభవార్త, తిరిగి తన ముకుళిత ఊహాపుష్పాన్ని వికసింపజేసింది.

''అయితే...ఏం జరిగిందే మనూ ?”

“అమ్మ ఇలా చెప్పిందే. ఎంత మోసగాళ్లో మనుషులు ఇప్పుడు తెలుస్తోంది. ఇక్కణ్ణుంచి మేమంతా తరలి వెళ్లాము. ఆ రోజునే అతను వాళ్ళఊరునుంచి అక్కడికి వచ్చాడు.. మా నాన్న అమ్మ కలిసి, అతణ్ణి తీసికొని బజారుకి వెళ్ళి, అతనికి నచ్చిన గుడ్డలన్నీ ఇంకా వెండి చెంబులూ అవీ కొన్నారు. ఇంటికి వచ్చేశారు. అతను 'ఎల్లుండి ముహూర్తం వేళకి వచ్చేస్తాం. మా ఇంట్లో ఎవళ్లూ రాకపోయినా నేనొక్కణ్ణయినా వచ్చేస్తాను' అని చెప్పి వెళ్ళిపోయాడట. పోనీ ఆ మాట అన్నతరువాతనైనా ఇతను ఎందుచేత అలా అంటున్నాడా ? అని ఆలోచించవచ్చా ? ఎవళ్ళకీ తట్టలేదట. నన్ను పెళ్ళికూతుర్ని చేశారు ప్రొద్దున. రాత్రిలగ్నం, వ్యవధిలేదు. ఎవర్నూ అటువైపునుంచి, ప్రొద్దున ఐదింటివరకు ఐపులేరు. ఇక మా వాళ్లందరికీ అదుర్దా కలిగింది. ఇద్దరు మనుషుల్ని ఆ వూరికి పంపించారు, సంగతి సందర్భాలు కనుక్కోరమ్మని. నాకిదంతా సాయంత్రంవరకూ తెలియదు. అప్పుడే నాకు చెప్పటం ఎందుకని ఊరుకున్నారుట. ఆ రోజు సాయంత్రం ఊరికే ఇంట్లోనుంచి బైటికి వచ్చి చూతును కదా మా నాన్న కళ్ళనీళ్లు పెట్టుకొని ఉన్నాడు. అది చూడడంతోటే నాకు నిస్పృహ కలిగింది. వెంటనే దుఃఖం పొర్లుకొవచ్చింది.”

''సరే...ప్రొద్దు కూకేటప్పటికల్లా, వెళ్ళిన వాళ్లిద్దరూ తిరిగివచ్చారు. అక్కడ అతని తల్లి తండ్రులూ, మరి ఇతరులూ, వాళ్లిద్దరినీ చివాట్లు పెట్టారుట. 'పెద్ద మనిషైనవాడు ఇదేనా చేయవలసిన పని? తల్లీ తండ్రీ ఉన్నారనుకున్నాడా? చచ్చారనుకున్నాడా ఆ పెద్దమనిషి ? చాలు చాలు లేవయ్యా ఇక వెళ్లండి...' అని. వాళ్లు పొరపాటని ఒప్పుకొని, ఈ ముహూర్తానికి కాకపోయినా మరో ముహూర్త మేదయినా తాము నిశ్చయించి వివాహం సలక్షణంగా జరపవలసిందని బ్రతిమిలాడారుట. 'ఈ సంబంధం మా కవసరం లేదు. ఇక మీరు మా గడప తొక్కటానికి వీల్లేదు' అని దులిపారుట ! వాళ్ళేం చేస్తారు? తిరిగివచ్చారు. ఇదీ జరిగింది...'' అని మనోరమ విచారంతో నిండిపోయింది.


“ విచారించకమ్మా మనూ వాళ్ళ సాంప్రదాయం మంచిది కాదటులే. నీ కింతకన్న మంచి సంబంధం వచ్చితీరుతుంది. జరిగిందానికేమీ అనుకోకు ” అని ఊరడించి గిరిజ అభయం కూడా ఇచ్చింది.

... ... ...

మనోరమామనోహరుల దాంపత్యం అప్పుడే క్రొత్తగా ఏర్పడ్డది. క్రొత్తదనం ఇద్దరిలోనూ ఇంకా పూర్తిగా పోలేదు. మనోరమ కాపరానికి వచ్చి కొద్దిరోజులే ఐంది. మనోహరుడికి కూడా, 'కాపరము'నే మాటతో పరిచయం కావట మిదే మొదటిసారి. మనోరమతో మాట్లాడటం క్రొత్త. మాట్లాడటం ఎలాగా అనేది ఒక మీమాంస. మాట్లాడితే ఎక్కడ తప్పుపట్టుచ్చో, అన్న భయం. అసలు అంత పరిచయంగా మాట్లాడచ్చో మాట్లాడకూడదో అనే సందేహం వీటిల్లో అటిట్టయిపోతున్నాడు మనోహరుడు. అవి తీర్చలేని సమస్యలై కూర్చున్నయ్ !

పురుషుడైన తనకే యిలాటి సందేహాలూ, భయాలూ కలుగుతే అసలే 'స్త్రీ' ఐన మనోరమకి ఎన్ని అంతులేని సందేహాలు భయాలూ కలిగిఉండాలి! నిజానికి వెయ్యిరెట్లు భయమే కలిగింది మనోరమకి. కాని వాళ్లిద్దరిలోనూ సహజంగా లేక పుట్టుకతోనే వచ్చిన ఒక విధమైన మౌనస్వభావము, గాంభీర్యమూ, ఈ రెండూ సమపాళ్లలో ఉన్నయ్. దాంతో ఈ ఇద్దరిలో ఏ ఒక్కరూ ముందంజ వేయ సాహసించ లేకపోతున్నారు.

మాట్లాడటమే సాహసకృత్యమనుకొంది మనోరమ. మనోహరుడు మనోరమకంటే ముందరే



**1947 లో బ్రిటను 7,000,000 టైర్లను ఎగుమతి చేసింది. ఇది ఫైర్‌స్టన్ టైర్స్ ఫ్యాక్టరీలోని ఒక విచిత్రమైన దృశ్యం.**

సాహసించగలడు కాని అతనికి మరొక సందేహ ప్రశ్న కలిగింది. "ఈ ముక్తసరి మాటల్తో ఎంత కాలం గడుస్తుంది?" అని. మనోహరుడు మనోరమని ఏరి కోరి చేసుకున్నాడు! ఆమెను తనదిగా చేసుకోటానికి ముందర ఎంతో తహతహలాడి పోయాడు. వివాహానికి పూర్వం తన హృదయ పరివర్తనలోని వైచిత్ర్యం వర్ణనాతీతం. ఆ విరహ బాధయొక్క ప్రాద్బల్యంవల్లనే కావచ్చు అతనికి మనోరమ సంబంధం రాగానే పిల్లని ఎట్లాగైనా చూచి సాధ్యమైనంత దగ్గరలో వున్న శుభముహూర్తాన వివాహం జరిపించుకో యత్నించాడు.

మనోహరుడిది పెద్ద కుటుంబం. తల్లి తండ్రులు ముదుసలులు. సోదర సోదరీలందరూ తనకన్న పెద్దలే. అందుచేత, అతను అందరికీ కడగొట్టు గారాబుబిడ్డ. అతని తల్లితండ్రుల పద్ధతి, అతి నే దోవన వెడతానంటే, ఆ దోవనే వెళ్లమనటం, దానికి తామెవ్వరూ అడ్డురాకపోవటం. కాబట్టి మనోహరునిది యధేచ్ఛ. అందుకని దుష్ప్రవర్తన ఉన్నదనుకొనుటకు వీలులేదు. తెలివితేటలతో బిఎస్. సి. ప్యాసయ్యాడు. వెంటనే శుభంగా ఉద్యోగం దొరికింది.

మనోరమకి మనోహరుడు దొరకటం అదృష్టమే అనవచ్చు కాని, మనోహరుణ్ణికన్న మనోరమకి దొరికేవారేమో అనే ఆశకూడా కలగవచ్చు కాని, మనోరమకి పూర్వం జరిగిన పరాభవానికి, ఇప్పటిది అనవసర స్మరణము కాబట్టి అదృష్టంకొద్దీ మనోహరుడు దొరికాడు. ఒక సంబంధం పోయిన కొత్తలోనే మళ్లీ సంబంధం దొరికి మనోరమకి వివాహం సలక్షణంగా జరిగిందంటే, అందరూ ఆనందించారు. "మనోరమకి తగిన వరుడు దొరికాడు. అతనికి రాసిపెట్టిఉంటే ఇంకో కళ్ళన్న కల్లా అవుతుం"దని అనుకున్నారు.

... ...

ఇదంతా మనోరమకి కళ్లకు కట్టినట్లనిపించింది. మనోహరుణ్ణి నిత్యమూ, మనస్సులో ఆరాధించుకుంటూండేది. ఆమె అదృష్టరేఖయొక్క అపూర్వ చరిత్రని పుట్టుపూర్వోత్తరాలు తెలియని మనోహరుడికి చెప్పి, ఒక మనఃపూర్వకమైన ప్రణామం చేద్దామనుకుంది మనోరమ. ఆ విధంగా నయినా, ఒక ప్రణయ సంభావణని సృష్టించుకుంది మనోరమ.

ఇప్పుడు మనోరమామనోహరుల కొక ముద్దుబిడ్డ. అచ్చు మనోరమే! మనోహరుడు ఆ ముద్దుబిడ్డకు పెట్టుకున్నాడు "సుజాత" అని.